వివాహ పరిచయ వేదికకు స్పందన

కాచిగూడ: కాచిగూడలోని మున్నూరుకాపు భవన్‌లో ఆదివారం నిర్వహించిన మున్నూరు కాపు వివాహ పరిచయ వేదిక జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల నుంచి హాజరైన తల్లి దండ్రులు, వధూవరులు పరిచయం చేసుకున్నారు. దాదాపు 2వేల మంది వివాహ పరిచయ వేదికలో పాల్గొని తమ వివరాలను పంచుకున్నారు. రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సంవిధాన్ బచావో కమిటీ చైర్మన్ డాక్టర్ పుంజాల వినయ్‌కుమార్, తోట రఘునాథ్‌రావు, జెల్లి సిద్ధయ్య, నిమ్మ శంకర్, గంప చంద్రమోహన్, దామేర జ్ఞానేశ్వర్, గోపాల రాధాకృష్ణ, కొమ్ము శ్రీనివాస్, కొంతం సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంగీత విభావరి



కాసర్ల సురేష్‌కు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను అందజేస్తున్న బింగి నరేందర్‌గౌడ్

చిక్కడపల్లి: చార్వి ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్‌టీసీ క్రాస్ రోడ్డులోని సిటీ కల్చరల్ సెంటర్ లో సంస్థ వ్యవస్థాపకులు కాసర్ల సురేష్ నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. ఈ కార్యక్రమంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, కేజే ఏసుదాస్ పాటలను పాడి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా గాయకుడు కాసర్ల సురేష్ 9 గంటలు పాటలు పాడి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకున్నారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆల్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ఆయనకు అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రమమాణిక్, శ్రీనివాసులు, వంశీరామారాజు, వినోదగౌడ్, బైరి శ్రీనివాస్, చైతన్య, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీఐ సౌత్ ఇండియా ఉపాధ్యక్షురాలిగా దివ్యచందన



చిక్కడపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేసిందని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే) రాష్ట్ర అధ్యక్షుడు పసుల రవి అన్నారు. ఆదివారం చిక్కడపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ సౌత్ ఇండియా ఉపాధ్యక్షురాలుగా ఢిల్లీకి చెందిన దివ్య చందన నియమితులైనట్లు ఆయన తెలిపారు. తమ జాతీయ అధ్యక్షుడు, కేంద్రమంత్రి రాందాస్ అథవలే దివ్య చందను నియమించారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలని చాలా ఘోరంగా ఉందని విమర్శించారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఆమలు చేయలేదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

'ఊరి చివరి మనిషి' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుద్దాల అశోక్‌తేజ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దియా విఘ్నేష్ రచించిన 'ఊరి చివరి మనిషి'పుస్తకాన్ని ఆదివారం సాయంత్రం సుందరయ్య ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జే రాములు అనే ఒక దళిత సామాజికవర్గానికి చెందిన పోలీస్ అధికారి ఆత్మకథను పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీయమని అన్నారు. కులం కారణంగా పుట్టినప్పటి నుంచి ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ.. భవిష్యత్‌పై కలలు కంటూ పెరిగిన వ్యక్తి రాములు అని తెలిపారు. అనుకోకుండా ఒక రోజు కాలేజీలో జరిగిన సంఘటన మూలంగా తాను అనుకున్న లక్ష్యాన్ని, కన్న కలని సాకారం చేసుకోలేక తప్పని పరిస్థితులలో పోలీసు శాఖలో జాయిన్ అయినప్పటికీ అంకితభావంతో పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. ఇలాంటి వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టి.రమేష్, డేవిడ్, గడ్డం సదానందం తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉర్సు



ముషీరాబాద్: ముషీరాబాద్‌లోని అషుర్‌ఖానా దర్గా ఉర్సు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పీర్లకు దట్టీలు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. స్థానికులతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ముస్లింలు, హిందువులు పెద్ద ఎత్తున హాజరై ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా భారీ బహిరంగ సభను సైతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, ముషీరాబాద్ సీఐ రాంబాబు, డీఐ నదీం హుస్సేన్, వాజీద్ హుస్సేన్ పాల్గొన్నారు.

నరికివేతలో ఉత్సాహం.. తరలింపులో తాత్సారం.!



బాగ్‌లింగంపల్లిలోని అంబేడ్కర్ కళాశాల వెనుక భాగం



దయానంద్‌నగర్‌లో ఓ ఇంటి వద్ద తొలగించిన చెట్ల కొమ్మలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: జీహెచ్‌ఎంసీ, విద్యుత్‌శాఖ అధికారుల సమన్వయ లోపం కారణంగా ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడకుండా సంబంధిత అధికారులు చెట్టు కొమ్మలను నరికివేస్తూ వాటిని అక్కడే రోజుల తరబడి ఉంచుతున్నారు. చెట్ల కొమ్మలను నరికివేతలో ఉన్న ఉత్సాహం తరలింపులో లేకపోవడం పట్ల ఆయా కాలనీలోని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల కాలనీలోని పరిసర ప్రాంతాలు అన్ని అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. అంతేకాకుండా రోజుల తరబడి అక్కడే చెత్త పేరుకుపోవడంతో దోమలు కూడా వ్యాప్తి చెందుతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు చేసిన పట్టించుకునే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

☛ వర్షాకాలం దృష్ట్యా విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా రోడ్లకు ఇరువైపుల కరెంట్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను కొన్ని రోజులుగా తొలగిస్తున్నారు. అయితే వెంటనే తరలించకుండా ఆయా బస్తీలు కాలనీలలో రోడ్డు పక్కన వదిలేసి వెళ్లిపోతున్నారు.

☛ బాగ్‌లింగంపల్లి అంబేడ్కర్ కళాశాల వెనుక భాగం ఎంఐజీ 2, దయానంద్ నగర్ తదితర ప్రాంతాల్లో చెట్టు కొమ్మలు నరికేసి అక్కడే వదిలివేశారు. ఇదే అదునుగా స్థానికులలోని కొందరు తమ ఇళ్లలోని వ్యర్థాలను వాటిల్లో వేస్తుండటంతో రోజు రోజుకు సమస్య తీవ్రతరం అవుతోంది. వెంటనే అధికారులు స్పందించి కొట్టివేసిన చెట్ల కొమ్మలను తరలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

దుర్వాసన వస్తోంది..



రోజుల తరబడి ఇంటి పక్కనే చెట్టు కొమ్మలు వేస్తున్నారు. వర్షం పడినప్పుడు అక్కడ దుర్గంధం నెలకొంటోంది. దుర్వాసన వస్తోంది. ఈగలు, దోమలు వృద్ధి చెందుతోంది.

– బ్రాహ్మణి, దయానంద్ నగర్

నిర్లక్ష్యం తగదు...



చెట్టు కొమ్మలను తొలగించడంలో నిర్లక్ష్యం తగదు. చెట్ల కొమ్మలను నరికేయడంలో లేని ఇబ్బంది ఆ కొమ్మలను తరలించడంలో ఎందుకు వస్తుందో తెలీదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

– మనోహర్‌రెడ్డి, బాగ్‌లింగంపల్లి

కనిపించే దైవం వైద్యుడు

మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

కాచిగూడ: డాక్టర్ శోభ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్, టీపీపీఎస్ వైద్య విభాగం ఆధ్వర్యంలో ఆదివారం 'ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ మెగా హెల్త్ క్యాంప్'నిర్వహించారు. బర్కత్‌పురలోని హరికిషన్ ఐ కేర్ అండ్ లేజర్ సెంటర్‌లో సర్వైకల్ కేన్సర్, బ్రెస్ట్ కేన్సర్, ఓరల్ కేన్సర్‌తో పాటు ఐ, రేటీనా, గ్లోకోమా, ఈఎన్‌టీ, డయాబెటీస్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరై మాట్లాడారు. సమాజంలో నిస్వార్థంగా పనిచేసే డాక్టర్లను ప్రోత్సహించాలన్నారు. ప్రతి ఒక్కరూ జీవితంలో తరచుగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, బీజేపీ నేతలు డాక్టర్ ఎన్.గౌతంరావు, కార్పొరేటర్ ఉమారాణి, రమేష్‌యాదవ్, డా. సమత, చిట్టి శ్రీధర్, సూర్యప్రకాష్ సింగ్, బల్బీర్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకమలం అవార్డుల ప్రదానం



చిక్కడపల్లి: రాగం మ్యూజిక్, డాన్స్ అకాడమీల ఆధ్వర్యంలో త్రిబాణధారి బార్బరిక్ చిత్ర యూనిట్‌ను ఆదివారం త్యాగరాయ గాన సభలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురికి స్వర్ణకమలం అవార్డులను ప్రదానం చేశారు. సినీ నిర్మాత విజయపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఘటోత్కచుని తనయుడు బార్బరిక్ చరిత్రను నేటి తరానికి తెలియజేయాలని దక్షిణ భారత దేశంలోని 5 భాషల్లో సినిమాను విడుదల చేస్తున్నామని అన్నారు. నాట్య గురువు లతామోహన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సినీ దర్శకుడు మోహన్, మిమిక్రీ కళాకారుడు మల్లం రమేష్, ప్రముఖులు రమేష్‌రెడ్డి, ఖుషీందర్, ఈశ్వర్, కార్తికేయ, క్రాంతికిరణ్, మేఘన, తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 1 నుంచి వీవర్స్ హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్

కాచిగూడ: వీవర్స్ హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్‌ను ఆగస్టు 1, 2, 3వ తేదీల్లో నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో నిర్వహిస్తున్నట్లు వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు గుంటక రూపా తెలిపారు. గద్వాల, నారాయణపేట్, మంగళగిరి, పోచంపల్లి, ధర్మవరం, కంచి, ఉప్పాడ, ఇల్కల్, వెంకటగిరి కాటన్ తదితర ప్రాంతాల చేనేత ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

ప్రతిభతో పాటు అనుభవాన్ని గుర్తిస్తేనే ప్రగతి



ప్రముఖులకు జీవన సాఫల్య పురస్కారాలు ప్రదానం చేస్తున్న డా. కేఐ వరప్రసాద్‌రెడ్డి

చిక్కడపల్లి: ప్రతిభతో పాటు అనుభవాన్ని గుర్తిస్తేనే ప్రగతి అని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం కొమర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నారాయణగూడలోని ఒక హోటల్‌లో ఎంపిక చేసిన ప్రముఖులకు జీవన సాఫల్య పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. శాంత బయోటెక్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ కేఐ వరప్రసాద్‌రెడ్డి ముఖ్యఅతిథిగా ప్రముఖులు ఓలేటి పార్వతీశం, సీఆర్ విశేశ్వర రావు, తాడేపల్లి పతంజలి, వింజమూరి బాల మురళీలకు పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మా శర్మ, జితేందర్, దుర్గాప్రసాద్, రవి, సతీష్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువత గౌరవంగా జీవించే సమాజం కావాలి



మాట్లాడుతున్న మాడభూషి శ్రీధర్

ముషీరాబాద్: యువకులు ఆత్మగౌరవంతో జీవించగలిగే సామాజిక ఆర్థిక పరిస్థితులు గల సమాజం రావాలని కేంద్ర సమాచార శాఖ మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య పేర్కొన్నారు. ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) రాష్ట్రస్థాయి జనరల్ కౌన్సిల్ మార్క్స్ భవన్‌లో ప్రారంభమైంది. పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ ప్రదీప్ జెండా ఆవిష్కరించి జనరల్ కౌన్సిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ.. యువకులు కనీస అవసరాలు కూడా తీరలేని పనులలో నలిగిపోతున్నారని అన్నారు. మద్యం, మత్తు, మూఢనమ్మకాల వంటి విషయ వలయాలు యువతను పక్కదారి పట్టిస్తున్నాయని పేర్కొన్నారు. వీటన్నింటిని ఛేదించి యువకులు సమాజం గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.హన్మేష్, ట్రేడ్ యూనియర్ సెంటర్ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎల్.పద్మ, ప్రగతిశీల మహిళా సంఘం పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు డి.స్వరూప, ఎస్.అజయ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రతాప్, ఎంవీ రాకేష్, సహాయ కార్యదర్శులు ఎం.రవికుమార్, ఈశ్వర్, కోశాధికారి బుచ్చిరాజు, రాష్ట్ర కమిటీ నాయకులు కె.రామకృష్ణ, ప్రేమ్‌సింగ్, దేవ, పెద్దింటి రామకృష్ణ, బీఎస్.కృష్ణ, సిద్ధు, నవీన్, అనీష్ తదితరులు పాల్గొన్నారు.

నగలు, నగదు బ్యాగు చోరీ

జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ మహిళ నగదు, గొలుసు, సెల్ ఫోన్ల బ్యాగు చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... విజయనగరం పూల్‌బాగ్ ప్రాంతానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి ఎం.రాకేష్ శంషాబాద్ ఆర్‌బీనగర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. అజంతా ఎక్స్‌ప్రెస్ రైల్లో మన్మాడ్ రైల్వే స్టేషన్ నుంచి వస్తుండగా రైలు ముత్కేడ్ రైల్వే స్టేషన్ వద్ద ఉండగా చూసుకునే సరికి రూ.10వేలు నగదు, రూ.30వేల విలువైన గొలుసు, రెండు సెల్ ఫోన్లు ఉన్న రాకేష్ తల్లి చేతి బ్యాగు కనబడలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్‌ఐఆర్ కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ పద్మ వెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బాగ్ అంబర్‌పేట డీడీ కాలనీలోని అజ్ఞాత వైభవ్‌నగర్‌లోని సీజన్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని కార్పొరేటర్ బి.పద్మ వెంకట్ రెడ్డి, హాస్పిటల్ ఎండీ డా. దేవేందర్‌రెడ్డి, డా. శ్రీనివాస్, డా. క్రాంతి, డా. ఎస్.గౌతంరావు, శ్రీకాంత్ గౌడ్, ఉషశ్రీలతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇలాంటి వైద్య శిబిరాలకు వచ్చి ప్రజలు హెల్త్ చెకప్ చేసుకోవాలని చెప్పారు. వైద్య పరీక్షల ద్వారా ఏదైనా జబ్బు ఉంటే బయటపడుతుందని అన్నారు. డా. హరిచరణ్, డా.అశ్విని, డా.రాంబాబు, డా.రాజీవ్ కట్ట రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు చేశారు.

ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలి

బీసీ విద్యార్థుల ధర్నాలో రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్



బీసీ హాస్టల్స్ విద్యార్థుల ధర్నాలో నినాదాలు చేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, బీసీ నాయకులు

కవాడిగూడ: రాష్ట్రంలో వివిధ కాలేజీ కోర్సులలో చదువుతున్న దాదాపు 14 లక్షల మంది కాలేజీ విద్యార్థులకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న రూ.6వేల కోట్ల ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ, సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరో వంద బీసీ కాలేజీ హాస్టళ్లను మంజూరు చేసి బీసీ గురుకుల పాఠశాలల్లో 20 శాతం సీట్లను పెంచాలన్నారు. ఆదివారం బీసీ విద్యార్థి సంఘం, నిరుద్యోగ జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లపల్లి అంజి, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్ అధ్యక్షతన ఇందిరాపార్కు వద్ద బీసీ హాస్టల్ విద్యార్థులతో భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

◆ ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. ఎంతో ముఖ్యమైన స్కాలర్‌షిప్, ఫీజు బకాయిల స్కీమ్‌ను ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నీరుగారుస్తోందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 20 నెలల కాలంలో పెండింగ్‌లో ఉన్న ఫీజుల బకాయిలు విడుదల చేయకపోవడం బాధాకరమని అన్నారు. ఫీజు రియంబర్స్‌మెంట్ పథకం అమల కోసం ప్రతి ఏటా నాలుగు శాఖల ద్వారా రాష్ట్ర బడ్జెట్‌లో రూ.5వేల కోట్ల నిధులు కేటాయించి ఒక్క రూపాయి కూడా విడుదల చేయకుండా ల్యాప్స్ చేశారని ఆయన మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఈ పథకం అమలు కోసం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులు ఏమవుతున్నాయని ఆయన ప్రశ్నించారు. ఈ పథకం సక్రమంగా అమలు చేయకపోవడంతో లక్షలాది మంది విద్యార్థులు ఉన్న విద్యకు దూరం అవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

◆ ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కాలేజీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను చెల్లించి ఆదుకోవాలన్నారు. లేని పక్షంలో విద్యార్థులతో కలిసి ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఒకవైపు బీసీ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తూ మరో వైపు 42శాతం రిజర్వేషన్లు అంటూ బీసీలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ మోదిరాందేవ్, నాయకులు అనంతయ్య, రాజేందర్, శివ అనురాదగౌడ్ ఆశిష్ గౌడ్ తదితరులతో పాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా గంగు భానుమూర్తి జయంతి



భానుమూర్తి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ధూప దీప నైవేద్య అర్చక సంఘాల ప్రతినిధులు

నల్లకుంట: బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం నల్లకుంటలో తెలంగాణ బ్రాహ్మణ పరిషత్(టీబీపీ), తెలంగాణ దేవాలయముల మతైక అర్చక ఉద్యోగుల సంఘం(టీడీఎంఏఈఎస్), ధూప దీప నైవేద్య అర్చక సంఘం (డీడీఎన్ఏఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత గంగు భానుమూర్తి 68వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా శివం రోడ్డులో గల దివంగత భానుమూర్తి విగ్రహానికి పూల మాలలు వేసిన బ్రాహ్మణ, పరిషత్, అర్చక సంఘాల నేతలు ఘన నివాళులర్పించారు. అనంతరం స్థానిక న్యూరామాలయం ప్రాంగణంలో టీబీపీ అధ్యక్షుడు గంగు కృష్ణ చైతన్య అధ్యక్షతన 'ఆత్మీయ సమ్మేళనం'జరిగింది. దీనికి హాజరైన పలువురు అర్చక సంఘాల ప్రముఖులు అక్కడ ఏర్పాటు చేసిన భానుమూర్తి చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. ఆలయాల అర్చక ఉద్యోగుల సంక్షేమం కోసం దివంగత గంగు భానుమూర్తి చేసిన కృషిని కొనియాడారు. ఈ సమ్మేళనంలో తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ శర్మ, టీబీపీ శ్రీవాణి, శిరీష్, బిన్నూరి ప్రశాంత్, టీడీఎంఏఎస్, డీడీఎన్ఏఎస్ ప్రతినిధులు నాగేంద్ర శర్మ, శ్రీకాంత్, రామలింగయ్య, రాజశేఖర్, పవన్, విజయ్ కుమార్, సతీష్ శర్మ, రామకృష్ణ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



శిబిరంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట: తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం న్యూ నల్లకుంటలోని శ్రీరామ హౌజింగ్ సొసైటీ హాల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. విశిష్ట సేవా మిత్ర బ్రాహ్మణ మంధు గంగు భానుమూర్తి 68వ జయంతిని పుర్కరించుకొని ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ అమృత, మాజీ కార్పొరేటర్ గరిగంటి శ్రీదేవి రమేష్ సందర్శించి వైద్య పరీక్షల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో పాల్గొన్న సుమారు 200 మందికి బీపీ, బ్లడ్ షుగర్, ఈసీజీ, నేత్ర పరీక్షలతో పాటు బోన్ డెన్సిటీ పరీక్షలు న్విహించారు. ఈ కార్యక్రమంలో టీబీపీ రాష్ట్ర అధ్యక్షుడు గంగు కృష్ణచైతన్య, శ్రీవాణి, శిరీష్, ప్రశాంత్ బిన్నూరి, న్యూరామాలయం పాలక మండలి చైర్మన్ గోపాల్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు గెల్వయ్య, భాస్కర్‌గౌడ్, విజయేంద్రసాగర్, రాముయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్



తొట్టెల ఊరేగింపులో తొట్టెల నారాయణస్వామి కుటుంబ సభ్యులు, నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా బోనాల పండుగ నిలుస్తుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ఆదివారం సుందరయ్యపార్కులో తెల్ల ఉప్పలమ్మ ఆలయంలో శ్రావణమాస బోనాల ఉత్సవాలు ఆలయ చైర్మన్ బబ్లు(వెంకటకృష్ణ) ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రాజ్య సభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్ కె.రవిచారి, ముఠా జైసింహ, కాసాని ఆనంద్, లోకేష్ యాదవ్ హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, ఎ.కిషన్‌రావు, ఎంఎస్ రావు, రీతిష్, అంబటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, రిషి, రాయపాటి రవి, సునీతారెడ్డి, కృష్ణా, శ్రీదేవి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్‌లో వైభవంగా శ్రావణమాస బోనాలు

ముషీరాబాద్: భోలక్‌పూర్ రంగానగర్‌లో ఆదివారం శ్రావణమాసం బోనాలు వైభవంగా కొనసాగాయి. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను తీసుకువచ్చి నల్ల పోచమ్మ, భూలక్ష్మి దేవాలయాలలో సమర్పించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, ముఠా జైసింహ, వై.శ్రీనివాస్‌రావు, ముప్పిడి నర్సింగ్‌రావు, నాగేష్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. సాయంత్రం బ్యాండ్ మేళాలతో తొట్టెలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారి ఆలయంలో సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేష్, రంగానగర్ యువజన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి వినోద్, కోశాధికారి ఎల్లేష్, నాయకులు మల్లేష్, రవికుమార్, నాగేష్, ధర్మేందర్, శేఖర్ తదతరులు పాల్గొన్నారు.

తొట్టెల నారాయణస్వామి ఆధ్వర్యంలో భారీ ఊరేగింపు...

కవాడిగూడ: ప్రతి ఏటా తొట్టెల బీర్ల నారాయణ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించే భారీ తొట్టెల ఊరేగింపు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని జలవాయి టవర్స్ సమీపంలోని తన ఇంటి అమ్మవారికి ప్రతేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ తొట్టెల ఊరేగింపును బ్యాండ్ మేళాలు మధ్య ప్రారంభించారు. లోయర్ ట్యాంక్‌బండ్ నుంచి బయల్దేరి బండ మైసమ్మనగర్ అమ్మవారి దేవాలయంలో తొట్టెలను సమర్పించారు. ఇందిపార్కు చౌరస్తా మీదుగా లోయర్ ట్యాంక్‌బండ్ శ్రీ కనకాల కట్టమైసమ్మ దేవాలయం, దోమలగూడ , గగన్ మహల్‌లోని నల్ల పోచమ్మ దేవాలయం, అడ్వకేట్ కాలనీలోని శ్రీ బాలనాగమ్మ దేవాలయాల్లో తొట్టెల సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో తొట్టెల నారాయణ కుటుంబ సభ్యులు, భారతీబాయి, నర్సింగ్, నాగేష్, కాళిదాసు, బీజేపీ నాయకులు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, సీహెచ్ శ్రీనివాస్‌ముదిరాజ్, శివరాజ్, శంకర్‌లాల్, సత్యనారాయణ, వీరు పటేల్, పరశురాం తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దోమలగూడ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



సుందరయ్య పార్కులో బోనమెత్తి వెళ్తున్న మహిళలతో ఎమ్మెల్యే ముఠా గోపాల్, జైసింహ



రంగానగర్ నల్లపోచమ్మ దేవాలయంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు



అమ్మవారి ఆలయానికి బోనాలను తీసుకొస్తున్న మహిళలు